గల్పిక

# పస్తాపం

కొడవటిగంటి కుటుంబరావు

ఈ కాంతం, కనకం, శరభయ్య, గోపాలరావూ ముఠా అంతాచేరి నన్ను మేధావుల జాబితాలోంచి తీసేస్తామంటున్నారుట. ఇది చాలా అక్రమం. నేను అప్పటికీ, ఇప్పటికీ, ఎప్పటికీ మేధావినే. "కమ్యూనిజమంటే నాకెందుకు కడుపుమంట?" అనే శీర్షికకు నన్ను రాయమన్నారు. నేను చిత్తురాశానుకూడా. దాన్ని సాఫురాసే లోపుగా కిష్టమూర్తివచ్చి "ఏం భాయ్? ఇక ఊరుకుంటే లాభంలేదు. మెరికల్లాటివి నాలుగు పాయింట్లు చెప్పు!" అన్నాడు. బుద్ధి గడ్డితిని నేను రాసిన పాయింట్లన్నీ చెప్పేశా. అతను వాటినికాస్తా కాగితంమీద పెట్టేసి పత్రిక్కి తనపేర పంపేసుకున్నాడు.

"పోనీలే! ఎవరిపేర పడితేనేం? ప్రచారం కదా ప్రధానం?" అని నేను సరిపెట్టుకున్నా. అదంతా కలిసి నాకే ఎదురొస్తుందని ఎట్లా అనుకునేదీ?

" 'కమ్యూనిజం – కడుపుమంట' శీర్షికకు నువు రాస్తానని ఎందుకు రాయలేదూ?" అని శరభయ్య నన్నిప్పుడు నిలవదీసి అడుగుతున్నాడు?

"నేను రాశాను. కాని కిష్టమూర్తి కాజేశాడు," అని చెప్పనా? అసలే ఐకమత్యం ప్రధానం అయిన ఈ క్లిష్టపరిస్థితుల్లో కీచులాడుకోవటం ఏమన్నా భావ్యంగా ఉంటుందీ? 'వాళ్ళకు' అలుసైపోమూ?

నేను రాయలేదన్న పొడ్డే అనుకుంటే, కిష్టమూర్తిచేత నేనే రాయించానని గోపాలరావు నామీద ఇంకో పొడ్డు వేశాడు? అది చూడండి!

కిష్టమూర్తి రాసిన దానిమీద "వాళ్ళు" ఎదురురాస్తూ వెటకారమూ, వేళాకోళమూ చేశారు. చాతకాకుండా రాస్తే చెయ్యరూ? కిష్టమూర్తికి అపఖ్యాతి రావటంకోసం నేను అతనిచేత అది రాయించానట! గోపాలరావు అంటున్నాడు. ఎబ్బెబ్బే ఏం మనుషులు?

ఇంతకూ ఇవన్నీ నైమిత్తిక కారణాలు. అసలు కారణం రంగయ్య. ఈ మాట పైకి అన్నానో వేటకుక్కల్లాగా మీద పడతారు– అసలే రంగయ్యకు ద్రోహంచేశానని ఆడిపోసుకుంటున్నారు!

మాట పడవలసే యోగం వచ్చేసరికి అందరూ ఒక్కసారిగా గతం మరిచిపోతారు కాబోలు. ఈ కాంతం, కనకం, శరభయ్య, గోపాలరావూ, రంగయ్యను దుమ్మెత్తిపోసిన రోజుల్లో అతన్ని వెనకేసుకొచ్చింది నేనూ! వాళ్ళు రంగయ్యను దుమ్మెత్తి పోయటం తప్పనికాదు. మన వాడు, కీర్తి కండూతి ఎక్కువై, "అభ్యుదయం, అభ్యుదయం" అంటూ గంతులేసి కమ్యూనిస్టుల నోళ్లలో తలదూర్చి రైతు కూలీలను గురించీ, వాళ్ళు ఓడ్చే చెమట గురించీ ఇంకేమేమిటో గురించీ చెత్తాఖానీ పద్యాలు తెగరాశాడు.

"గుడ్డికన్ను తెరిచినా, మూసినా ఒకటే! రంగయ్య ఏదో రాసిపోతున్నాడని మనం విచారించ వలసిన పనిలేదు. వాడు మనిషి మనవాడే!" అని నేనన్నాను కూడానూ.

తల్లిశిగగోయ్యా, ఆ మాటకూడా నా కిప్పుడెదురే వచ్చింది! "నన్ను నువ్వు గుడ్డికన్ను అన్నావుటగా!"అని రంగయ్యే నిలవదీసి అడిగాడు.

'నేను లోగడ రాసిందంతా చెత్త! కమ్యూనిస్టులు నన్ను మభ్యపెట్టి నాచేత ఆ చెత్తంతా రాయించారు! నా కొన్నికొన్ని రచనలు వాళ్ళు పూర్తిగా తిరగరాశారు!' అని నువే చెబితివి గదటయ్యా!" అని అడిగాను. ఉన్నమాట అడగరూ...?

అసలు అందాకా దేనికి? రంగయ్యను వాళ్ళనుంచి బయటపడమని సలహా ఇచ్చింది నేగాదూ? కాదనమనూ!

"ఇదేమిటి, రంగయ్యా? పడకపడక నువు వాళ్ళమధ్య పడ్డావేమిటి? ఎన్నికలు వచ్చి పడుతున్నై! బోలెడంత పనివుంది నీవల్ల" అని నేనంటే, రంగయ్య ఆలోచించి, "సరే. నేను చెప్పినట్టు ఏర్పాటు చేయించు. బయటికి రావట మెంతసేపులే!" అని రంగయ్య అన్నాడు,

అన్నమాట నిలబెట్టు కున్నాడుకూడా! అంతా సజావుగానేజరిగిపోయింది. "వాళ్ళ" అనవలిసినమాటలు "వాళ్ళు" అన్నారు; మనవాడు రాంబాణంలాంటి ప్రకటన తయారుచేసి పత్రికల్లో పారేశాడు. అంతా చక్కగా అనుకున్నట్టు జరిగిపోయింది.

లేకపోతే, నాకు తెలీకడుగుతాను, రంగయ్యకు సాహిత్యమేమిటి? సాహిత్యం మొహం తెలీని ప్రజలు అనుకోవచ్చుగాని—తెలిసిన వాణ్ణి నేనెట్లా ఒప్పుకుంటానూ? రాజకీయాలంటారూ? ఛేఫ్! నేను కాదన్లేదే? రంగయ్య రైటైన మనిషి! రంగయ్య సాహితీపరుడుగా మనపక్షాన లేకపోయెనే అని నే నెన్నడూ దుఃఖ పడలేదే!

అటువంటప్పుడు కాంతంవచ్చి "ఏమోయ్? రంగయ్యకు సన్మానం ఏర్పాటు చేస్తున్నాం!" అనగానే నాకు బాంబుపేలి నట్టుండదూ?

నా చెవులను నేనే నమ్మలేక, "ఏం సన్మానం?" అన్నాను.

"ఇంకేం సన్మానం? కవిసన్మానం?" అన్నాడు కాంతం.

"చూడు, కాంతం! రంగయ్య తాను నిన్నటిదాకా రాసిందంతా చెత్త అని, వాళ్లు మోసగించి రాయించారనీ అనె! ఆ తరవాత ఏమీ రాయకపోయె! ఈ సన్మానం దేనికని ఏర్పాటు చేసినట్టు?" అని అడిగాను.

అడగనూ? అదితప్పా? రేపు "వాళ్ళు" మటుకు అడగరూ? అప్పుడు బాగుంటుందేం? ఇందుకు నేను "ప్రచ్ఛన్న అభ్యుదయ" వాదినా? మొదటినుంచీ నా ప్రవర్తన "అనుమానాస్పదం" గానే ఉందా? కన్యాశుల్కం గురజాడదే అయి ఉంటుందని నేననటం అందుకు సాక్ష్యమా?

ఈ లెక్కన మేధావులగతి ఏమయ్యేట్టు?